# కట్నం

రచన:
పి. హరిప్రసాదరావు
(జాతీయరచనమండలి)

రాజా!

నీవు రాసినవుత్తరం అందింది. ఆ జాబు ఎంత బాధతో వ్రాశావో నేను తేలికగా వూహించుకో గలిగాను. ఏంచేస్తావు పాపం! యీ నరపశువులు కట్నాలనే పిశాచాన్ని లోకంమీదికి ప్రయోగించి నీవంటివారిని మానసికంగా దారుణబాధలకు గురిచేస్తున్నారు. ఎంతచదువుకుని లోకజ్ఞానం సంపాదించినవాడైనా 'కట్నంఏమిస్తావు?' అని అడిగేవాడే! అంతేగాని ఎదుటివాని బాధలేమిటో ఎంతమాత్రం వూహించరు. అసలే యీకరువురోజుల్లోడొక్కాడడమే దుర్లభంగావుంటే దరిదాపూ లేకుండావున్న యీ కట్నాలిచ్చి పెండ్లిచేయడం యెంతకష్టం? పిచ్చిరాజూ! నువ్వు యిన్ని రోజులనుండీకూడా కట్నంలేకుండా నీకు బావ దొరుకుతాడనేనా ప్రయత్నిస్తూంది. అలా లభించేది యిప్పుడుకాదు. ఇంకా యేపదేండ్లకో గాని!

రాజూ! నీవు మానసిక వేదనల ననుభవించుతూ వెర్రి మొర్రిగా వూహాగానం చేస్తున్నావ్. ఆ నీ వూహాలు కలలలోనేగాని యీ దరిద్ర ధనపిశాచానికి చేతులుచాచే యీ మానవులపైనా నీ వూహాలు. అవి యెన్నటికీ ఫలించవు. శారదా చట్టంవలె యీకట్నాలకుకూడా యేదైనా శాసనంపెడితే బాగుండునని వ్రాశావు. శారదాచట్టం యెంత అందంగా యేడిచింది? ఆచట్టం యిప్పుడు యేమైనా పనిచేస్తుందా? ఆలోచించు. కట్నాలకుకూడా శాసనంపెడితే అదీ అంతే లాభిస్తుంది. శారదాచట్టం అమలులోవుందని చిన్నపిల్లల పెండ్లిండ్లు మానారా? మొన్న నేను నారాయణషాపువద్ద కూర్చునుండగా వొక పెండ్లి వూరేగింపువచ్చింది, ఆ వధూవరుల వయస్సెంతో తెలుసా? వధువుకు యెనిమిదేండ్లు, వరునికి పన్నెండేళ్లు. వారిని యేమిచేసిందీ శారదాచట్టం? మన ప్రభుత్వం మనకెప్పుడూ లాభించే శాసనాలను చేయదు. ఇప్పుడైనా తెలిసిందానీకు మనశాసనాలు మన కెంతలాభిస్తూన్నవో?

నీ వూహాలన్నీతప్పక ఫలిస్తవని నీవు చాల ధైర్యంతో వున్నట్లుగాతోస్తుంది, నాకు నీజాబు చదివినపిదప. ఆ బాగాఫలిస్తాయి! ఎక్కడ? యీ వాస్తవిక ప్రపంచంలోకాదు. స్వప్నప్రపంచంలో! 'మనవృద్ధులే మనదేశం యిలా పాడవడానికి కారణం. యువకులెవరూ యింతఆశకు లోనుగారు, అని వ్రాశావు అది పొరపాటంటాను నేను. ఎలాగంటావా! మన మిత్రుడు వెం...మూర్తి యేమన్నాడో. బెజవాడనుండి వానికో సంబంధంవచ్చింది మొన్న. వానితండ్రి వానినెంతో బ్రతిమాలాడు కట్నంలేకుండా ఆ అమ్మాయిని చేసుకోమని. వాడు తండ్రికేమని జవాబిచ్చాడో తెలుసా! 'నేను తాలూకాఫీసులో పనిచేస్తున్నాను. నెలకు యెలాలేదన్నా అరవైరూపాయలుసంపాదిస్తున్న నేను కట్నంలేకుండా పెండ్లి చేసుకోను' అన్నాడు. వాడొక వెధవ వాడి లెక్క మనకెందుకు అంటావేమో! యింకో సంగతి చెబుతా జాగ్రత్తగా చదువు.

మనం థర్డుఫారం చదువుతూంటేప్పుడు మన క్లాసులో చాటపర్రు కుర్రవాడు రామం అనే అతను చదువుతూండేవాడు జ్ఞాపకముందా? మన హెడ్ మాష్టరు అతని అలంకారాన్ని చూచి 'భోగంపిల్లలా వుంటావోయ్' అనేవాడు. అతను యీమధ్య 'కామ్రేడ్' అయ్యాడు. యువజనసభలకూ, యింకా చిన్నచిన్న పార్టీసభలకూ అధ్యక్షుడుగావుంటూ భారతదేశ భాగ్యోదయానికి పాటుపడేవానిలా వుపన్యాసాలు దంచుతూ, మన దేశంలోవుండే అనేక సాంఘిక దురాచారాలను ఖండించుతూ, ఉపన్యాసాలు చెబుతూండేవాడు. మొన్న అతనివివాహానికి నారాయణ బలవంతపెడితే వెళ్లాను. వివాహం

అంత నూతనపద్ధతిమీద జరిగింది. భాజాభజంత్రీలు లేవు. ఏమీ అర్థంకాని బ్రాహ్మణమంత్ర పౌరోహిత్యంలేదు. వివాహానికివచ్చిన పెద్దలయెదుట వధూవరులిరువురూ 'తామిరువురూ యావజ్జీవితం ఒకటిగా నిలచి అన్యోన్యంగావుంటూ దేశక్షేమానికి పాటుబడతాం,' అని ప్రతిజ్ఞచేశారు. పూలమాలలు వేసుకోవడంతో వివాహం ముగిసింది. ఆ వివాహం చూస్తూన్నంతసేపూ నాహృదయం వుప్పొంగిపోయింది. వివాహం పూర్తయినతరువాత బయటికి వచ్చి వొక చెట్టుక్రిందకుజేరాం. ఇంకా అక్కడ నలుగురువున్నారు. నేను నారాయణతో, 'యీ పెండ్లి చాలాబాగుందిరా! ఏవిధమైనఖర్చూ, కట్నాల గొడవలేదు, అని అంటూండగా అక్కడవున్న వొక ముసలాయన యేమంటూన్నావు బాబూ! కట్నం లేదూ! ఎవరుచెప్పారునీతో కట్నం వందలుకాదు, పదివేలు!' అన్నాడు.

'ప—ది—వే—లు' అని ఆశ్చర్యపోయాను.

దేశ క్షేమానికై పాటుబడుతున్నాం అని డాబులుకొడుతూ లోలోపల యీవిధంగా తలిదండ్రులను పీల్చివేసే యీ యువకులా దేశానికి వుపయోగపడేది? యిప్పటికైనా గ్రహించావా యువకులుకూడా యెంత ఆశాలోలురై వున్నారో! గనుక నీవు యికనైనా వూహాప్రపంచాన్ని విడిచి వాస్తవిక ప్రపంచానికిరా యిలాంటివి చాలా వున్నాయి రాయాలంటే. యీ రైతులకిప్పుడు మరీ వేలం వెర్రిగావుంది. నాలుగు రూపాయలకిచ్చే ధాన్యంబస్తా పన్నెండురూపాలకమ్ముతూంది. వారికి క్రిందా మీదా యేమీ కానరావడంలేదు. కట్నాలసంఖ్య వేలకువేలు పెంచుతున్నారు.

రాజూ! నేను యిప్పుడు నీకివ్వబోయే సలహా యేమంటే! కలలుగంటూ యీ ప్రపంచంలో జరుగుతున్న వాటినివదలి యెక్కడో జరుగుతున్నట్లుగా మనదేశంకూడా జరుగునని వూహాలను వదులుకో. ధనమదాంధతతో కళ్లుమీదకొచ్చినవారు ముచ్చటగా అల్లునికి కట్నం యెరనుకల్పించారు. అది ముచ్చటల్లా పోయి వురిముడిఅయి కూర్చుంది పేదవారిమీద. ఇక సెలవు,

నీమిత్రుడు
'గిరి'


## కథాంజలి

అన్ని హిగ్గిన్‌బాథమ్సు బుక్ స్టాల్సు. లోను దొరకును. వెల 0-2-0

## యువ ప్రచురణాలు

ఒక్కొక్కటి పన్నెండణాలు

| | |
|---|---|
| పాపం! | 'చలం' |
| బ్రాహ్మణీకం | 'చలం' |
| హంపీకన్యలు | 'చలం' |
| మారుపేర్లు | కుటుంబరావు |
| బడదీదీ | శరత్ బాబు |
| తోకచుక్క | 'చక్రపాణి' |
| పాతమంగలి | 'చక్రపాణి' |
| వనఫూల్ రచనలు | 'చక్రపాణి' |
| అనామీలరు | 'సారీన్' |

ఒక్కొక్కటి రూపాయ

| | |
|---|---|
| మంగమ్మ (నాటకం) | 'చలం' |
| పతితకేశం (కావ్యం) | 'కవికోకిల' |

## యువ బుక్ డిపో

48 ఆచారప్పన్ స్ట్రీటు, మద్రాసు & తెనాలి